క్లుప్తంగా

నోషనల్ ఖాతాల సమస్యకు పరిష్కారం

పొదలకూరు: ఎంతో కాలంగా రైతులు ఎదుర్కొంటున్న నోషనల్ ఖాతాల సమస్యకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో పరిష్కారం లభించిందని తహసీల్దార్ వీరవసంతరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. పట్టాదారు పాస్‌పుస్తకాలకు నోషనల్ ఖాతాలు ఉన్న వాటిని రెగ్యులర్ ఖాతాలుగా మార్చేలా పరిష్కారం లభించిందన్నారు. నోషనల్ ఖాతాలను రెగ్యులర్ ఖాతాలుగా మార్చుకోవాల్సిన రైతులు తగు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతినగర్‌లో గల వీర అభయాంజనేయస్వామికి విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. ఆకు పూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పల్లకిసేవను జరిపారు. భక్తులు విశేషంగా హాజరయ్యారు.

వేటకు కొనసాగుతున్న విరామం

ముత్తుకూరు: తుఫాన్ ప్రభావంతో తీర ప్రాంతంలో నిలిచిపోయిన చేపల వేట నేటికీ కుదుటపడలేదు. వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో మత్స్యకారులు వేటకు ఉపక్రమించలేదు. మండలంలోని నేలటూరు, కృష్ణపట్నం, ఈపూరు పట్టపుపాళేల మత్స్యకారులు 20 రోజులకుపైగా వేట విరామాన్ని ప్రకటించారు. ఇళ్లకే పరిమితమైన మత్స్యకార కుటుంబాలకు బియ్యం, పప్పులు, ఎర్రగడ్డలు తదితరాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో రేషన్‌షాపుల ద్వారా వీటిని అందజేశారు. ఈదురుగాలులు, ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలతో చేపల వేటకు అనుకూలించక మత్స్యకారులు ఇళ్లకే పరిమితయ్యారు.

పంచాయతీ కార్యదర్శి మృతికి సంతాపం

పొదలకూరు: రోడ్డు ప్రమాదంలో ఆర్‌వైపాళెం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ మృతి చెందడంపై వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ నగేష్‌కుమారి వేర్వేరు ప్రకటనల్లో తమ సంతపాన్ని వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శిగా చిత్తశుద్ధితో పనిచేశారని కొనియాడారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కార్బోఫ్యూరాన్‌తో ఉల్లికోడుకు చెక్

మనుబోలు: వరిని ఆశించే ఉల్లికోడు, కాండం తొలుచు పురుగులకు కార్బోఫ్యూరాన్ గుళికలతో చెక్ పెట్టొచ్చని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త విజయ్‌కుమార్ పేర్కొన్నారు. తుఫాన్ నేపథ్యంలో మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన వెంకన్నపాలెం, బద్దెవోలు, పిడూరుపాళెంలో నారుమడులు, వరినాట్లను జిల్లా వ్యవసాయాధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్బోఫ్యూరాన్ గుళికలను నారుమడి దశలో ఎకరాకు 160 గ్రాములు, నాట్ల దశలో పది కిలోల చొప్పున వేస్తే తర్వాతి దశలో వచ్చే ఉల్లికోడు, కాండం తొలుచు పురుగులను నివారించొచ్చని తెలిపారు. జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ మారుతీదేవి, ఏఓ శైలజాకుమారి, మనుబోలు వ్యవసాయాధికారి జహీర్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పశు దాణా పంపిణీ

మనుబోలు: పాడి రైతులకు ఉచిత పశు దాణాను మండలంలోని జట్లకొండూరు సచివాలయంలో సచివాలయ కన్వీనర్ గుంజి రమేష్ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు 25 కిలోల దాణా బ్యాగులను రైతులకు పంపిణీ చేస్తున్నామని వివరించారు. వెటర్నరీ అసిస్టెంట్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయం



మనుబోలు: తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మంగళవారం అందజేశారు. అంబేడ్కర్‌నగర్, సంగమేశ్వర గిరిజన కాలనీ, యాచవరం గ్రామాలకు సంబంధించిన బాధితులకు సచివాలయం - 1 వద్ద ఆర్థిక సాయాన్ని అందజేసిన అనంతరం నేతలు మాట్లాడారు. నష్ట తీవ్రతను బట్టి రూ.నాలుగు వేల నుంచి రూ.10 వేల వరకు సాయాన్ని అందజేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో విపత్తులు సంభవిస్తే ఎప్పటికో గానీ సాయం అందేది కాదని, అయితే ప్రస్తుతం బాధితులను సత్వరమే ఆదుకునేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. పార్టీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, మహేంద్రవర్మ, చల్లా నవకోటి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆడుదాం.. ఆంధ్రా ట్రైల్ మ్యాచ్‌లు



ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న శర్మద

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆడుదాం.. ఆంధ్రా ట్రైల్ మ్యాచ్‌లను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ శర్మద మాట్లాడారు. సచివాలయ స్థాయి నుంచే క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆడుదాం.. ఆంధ్రా పోటీలకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. ట్రైల్ మ్యాచ్‌లో పోలీస్ కాలనీ సచివాలయానికి సంబంధించిన క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో నెల్లూరు జిల్లా నుంచి పతకాలు సాధించిన క్రీడాకారులు తులసి, భవాని, శ్రీహరి, భాస్కర్‌ను అభినందించారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రసాద్, డీఎస్డీఓ యతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ పొడిగింపు

నెల్లూరు (లీగల్): జీఓ నంబర్ 512ను రద్దు చేయాలంటూ న్యాయవాదులు చేపట్టిన కోర్టు విధుల బహిష్కరణను ఈ నెల 22 వరకు పొడిగిస్తున్నామని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్ ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ మాట్లాడారు. మెజార్టీ న్యాయవాదుల అభిప్రాయం మేరకు క్రిమినల్ కేసుల బెయిళ్లు, సివిల్ కేసుల అవుట్ అఫ్ ఆర్డర్లకు మినహాయింపునిచ్చామని చెప్పారు.



మాట్లాడుతున్న ఉమామహేశ్వర్

డంపింగ్ యార్డులో పరిశీలన

నెల్లూరు(బారకాసు): అల్లీపురంలోని డంపింగ్ యార్డును కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం పరిశీలించారు. యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను పర్యవేక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు రీసైక్లింగ్ చేసి యార్డును పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రీసైక్లింగ్ ప్రక్రియకు అనుకూలంగా తడి, పొడి వ్యర్థాలను యార్డులో డంపింగ్ చేయాలని సూచించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఈఈ సంజయ్, డీఈఈ సురేష్, చాణక్య తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని రెడ్‌క్రాస్ ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కేక్‌ను కట్ చేయించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్, నేతలు కనకట్ల రఘురామ్ ముదిరాజ్, రమణయ్యగౌడ్, వేలూరు రంగారావు, రఘురామయ్య నాయుడు, సురేంద్రబాబు, సత్యం, సుబ్రహ్మణ్యం, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి అభినందన

నెల్లూరు (పొగతోట): హాకీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సౌత్‌మోపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి తాళ్ల సంపత్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అభినందించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మదనపల్లిలో ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికవ్వడాన్ని అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీ ఓవరాల్ చాంపియన్‌గా ‘డీకేడబ్ల్యూ’

నెల్లూరు (టౌన్): విక్రమ సింహపురి యూనివర్సిటీ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల విద్యార్థులు దక్కించుకున్నారు. విద్యార్థులను కళాశాలలో బుధవారం అభినందించిన అనంతరం ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. వర్సిటీలో ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించిన వాలీబాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో విన్నర్స్‌గా.. ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ విభాగాల్లో రన్నర్స్‌గా నిలిచి వర్సిటీ చాంపియన్‌షిప్‌ను సాధించారని కొనియాడారు. ఫిజికల్ డైరెక్టర్ విజయకళ, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు రాజశేఖర్, ఉమామహేశ్వరి, దివ్య, తమన్నా, అపర్ణ, పీఆర్వో జోజీ తదితరులు పాల్గొన్నారు.



గురుచరిత్ర ఏకాదశి ప్రవచన మహాయజ్ఞం ప్రారంభం

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరం, ద్వారకామాయి భవన్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న దత్తజయంతిని పురస్కరించుకుని 11వ గురుచరిత్ర ఏకాదశి ప్రవచన మహాయజ్ఞాన్ని మంగళవారం ప్రారంభించారు. నగరంలోని ఎమ్వీ అగ్రహారం నుంచి చంద్రశేఖర సరస్వతి, రామిరెడ్డితాత, ఎక్కిరాల భరద్వాజ మాస్టర్, నాంపల్లి బాబా వారి పాదుకలు, చిత్రపటాలను నగరోత్సవంగా తీసుకొచ్చారు. గురుచరిత్ర విశిష్టతపై విజయవాడకు చెందిన శ్రీనివాస్ వివరించారు. సాయిభరద్వాజ సత్సంగ బృంద నిర్వాహకులు కంజర్ల భాస్కరశర్మ, ఆశం విజయసారథి, వెన్నెలకంటి సుబ్బరామయ్య, పురాణం రమేష్, ఓంకారం రఘురామరాజు తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అఖండ హనుమాన్ చాలీసా పారాయణం



నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో 72 గంటల అఖండ హనుమాన్ చాలీసా పారాయణాన్ని మంగళవారం ప్రారంభించారు. తొలుత సీతారామ, లక్ష్మణ, హనుమంతుడికి అభిషేకాలు, పూజలను జరిపారు. విజయవాడకు చెందిన అఖిల భారత హనుమద్దీక్ష పీఠ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వేణుగోపాలుడిగా రంగనాథుడు



నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు వేణుగోపాలుడి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కొంజేటి సత్యనారాయణగుప్తా, కొంజేటి రంగయ్యగుప్తా వారసులు వ్యవహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భగవద్గీత అలంకారంలో వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు భగవద్గీత అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా దేవిశెట్టి వెంకటసుబ్బయ్యశ్రేష్ఠి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ దాసరి చంద్రశేఖర్‌రావు పర్యవేక్షించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఓటర్ల జాబితాలో రేషనలైజేషన్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ మంగళవారం నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల విభాగాధికారులు దేవీకుమారి, నిర్మలానందబాబా, శ్రీనివాసులు, ధనుంజయరెడ్డి, దశయ్య పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, గౌరవాధ్యక్షుడు అప్పారావు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పలు ఉపాధ్యాయ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పీఆర్టీయూ నేతలను సత్కరించారు.

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం



సాయాన్ని అందజేస్తున్న విజయకుమార్‌రెడ్డి, రంగారెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలో తుఫాన్ బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పేర్కొన్నారు. ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు కొండ్లపూడి పంచాయతీ పరిధిలోని రాజగోపాలపురం ఎస్టీ కాలనీలో బాధితులకు సాయాన్ని మంగళవారం అందజేశారు. రూ.2500 నగదు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, పార్టీ ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

నెల్లూరు రూరల్: త్వరలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో నిబంధనలను రాజకీయ పార్టీలు తప్పక పాటించాలని ఆర్డీఓ, నెల్లూరు రూరల్ నియోజవకర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మలోల పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మలోల

ఎస్ఎఫ్ఐ రూరల్ కమిటీ ఎన్నిక

నెల్లూరు (టౌన్): ఎస్ఎఫ్ఐ నెల్లూరు రూరల్ అధ్యక్షుడిగా సుకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ నెల్లూరు రూరల్ మహాసభలను పురస్కరించుకొని కరెంటాఫీస్ సెంటర్ నుంచి వేదాయపాళెంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నెల్లూరు రూరల్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శివ, చక్రి, సిసింద్రీ, సిద్ధూ నియమితులయ్యారు.



రెడ్ల భవన నిర్మాణానికి సహకరించరూ..

నెల్లూరు(బృందావనం): నగరంలో రెడ్ల ఐక్యవేదిక భవన నిర్మాణానికి సహకరించాలని పలువురు నేతలు కోరారు. ఈ మేరకు అడిషనల్ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అమరావతిలోని హైకోర్టు కార్యాలయంలో రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు నేతలు మంగళవారం అందజేశారు. ఐక్యవేదిక నెల్లూరు అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీవీ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెందోడి ధనుంజయరెడ్డి, సంయుక్త కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి నిర్మల హేమంత్‌కుమార్‌రెడ్డి, సభ్యుడు కల్లూరి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న నేతలు

వాడవాడలా ‘ఏపీకి జగనే ఎందుకు కావాలి’

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నగరంలోని నాలుగు డివిజన్లలో కార్పొరేటర్ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. 8వ డివిజన్లోని సీఆర్పీ డొంక సచివాలయ పరిధిలో మొగళ్లపల్లి కామాక్షిదేవి.. 13వ డివిజన్ రామాలయం వీధి సచివాలయ పరిధిలో ఊటుకూరు నాగార్జున.. 42వ డివిజన్ మెక్లిన్స్ రోడ్డు - 2 సచివాలయ పరిధిలో కరిముల్లా.. 44వ డివిజన్ లీలామహల్‌రోడ్డు సచివాలయ పరిధిలో నీలి రాఘవరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



8వ డివిజన్లో వైఎస్సార్సీపీ పతాకావిష్కరణ

నేత్రపర్వంగా కల్యాణోత్సవం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిర ప్రాంగణంలో కొలువైన అభయాంజనేయస్వామి సన్నిధిలో సువర్చలాదేవి సమేత హనుమత్ కల్యాణాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. ఆంజనేయస్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్రను పురస్కరించుకొని మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు విశేషంగా హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. మందిర కమిటీ ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు, బిజ్జం విజయకుమార్‌రెడ్డి, వాణి మల్లీశ్వరి దంపతులు పాల్గొన్నారు.



ట్రెక్కింగ్ క్యాంపునకు ‘కేఎన్నార్’ విద్యార్థులు

నెల్లూరు (టౌన్): కేరళలోని ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ కొట్టాయంలో నిర్వహించనున్న ఆలిండియా ట్రెక్కింగ్ క్యాంపునకు కేఎన్నార్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్ తెలిపారు. ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో మంగళవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 22 నుంచి 29 వరకు నిర్వహించనున్న క్యాంపునకు 10 ఆంధ్రా నావల్ యూనిట్ ఎన్‌సీసీ క్యాడెట్లు గురవయ్య, వెంకటదినేష్, మోహిత్‌రామ్ ఎంపికయ్యారని చెప్పారు. ఎన్‌సీసీ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల ప్రారంభం అడ్డగింత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్లలో గల అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు ఐసీడీఎస్, సచివాయ సిబ్బంది యత్నించగా సీపీఎం నేతలు అడ్డుకున్నారు. వెంకటేశ్వరపురం, జనార్దన్‌రెడ్డికాలనీల్లో 30 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటిని మూడు రోజులుగా మూసేశారు. ఫలితంగా చిన్నారులకు చదువుతో పాటు మధ్యాహ్నం పౌష్టికాహారం అందడంలేదు. ఈ క్రమంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం, సచివాలయ సిబ్బందితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వచ్చి తాళాలు తీసేందుకు మంగళవారం యత్నించారు. ఈ తరుణంలో సీపీఎం నేతలు అడ్డుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని లక్ష్మీరాజ్యం తెలిపారు.